కథ

# రక్తసంబంధం

పిండివంటల ఘుమఘుమల్తో పట్టుచీరల పెరపెరల్లో పెళ్ళివారిల్లు సందడిగా ఉంది. ఎటు చూసినా పెళ్ళికళ తాండవిస్తోంది. పిన్నా పెద్దలందరి ముఖాల్లోనూ ఆనందం చిందులేస్తోంది. కానీ, నా మనసులోనే ఏదో అలజడి తొలిచేస్తోంది. జరగబోయేది నా మేనకోడలి పెళ్ళి. మేనమామగా అక్కడ నాకెంతో గౌరవం లభిస్తోంది. అయినా 'ఇదీ' అని చెప్పలేని అసంతృప్తి నా మనసుని పట్టిపీడిస్తోంది.

ఆ అసంతృప్తికి కారణం ఏవిటో ఎంత ఆలోచించినా అర్థం కాలేదు. ఆ క్షణంలో నాకు హఠాత్తుగా రంగడు గుర్తొచ్చాడు. ''ఛ ఛ! ఇలాంటి సమయంలో వీడు గుర్తొచ్చాడేవిటీ?'' విసుగ్గా అనుకుంటూ తల విదిలించాను.

ఇంతలో ఇంటిముందు ఆటో ఆగిన శబ్దమైంది. దిగ్గున పైకి లేచి హడావిడిగా అటు దారితీశాను. ఆత్రంగా ఆటో దగ్గరకి పరుగెత్తిన నాకు ఆపసోపాలు పడుతూ ఆటోలోంచి దిగుతున్న పెద్దమావయ్య కనిపించాడు.

మావయ్యకి ఎదురెళ్ళాను. స్వాగతం చెప్పాను. తనివితీరా కౌగిలించుకున్నాను. ఆ కౌగిలి అమ్మ ఒడిని గుర్తు తెచ్చింది. అయినా ఏదో ... అసంతృప్తి నన్ను వీడ... లేదు. మా బంధువులంతా ... వచ్చారు. అయినప్పటికీ నాకు ఆనందం కలగలేదు.

మరో అరగంట తర్వాత...ఇంటిముందు రిక్షా ఆగింది. పరుగెత్తుకెళ్లాను. దిగింది మా బావమరిది తరఫువాళ్ళు. ఎదురేగి వాళ్ళని ఆహ్వానించాను. మర్యాదలు పూర్తిచేసి వచ్చి పందిట్లో ఉన్న కుర్చీలో చతికిలపడ్డాను. ఎందుకో తెలీదుకానీ నోరంతా చేదుగా ఉంది. గుండెల్లో మంటగా కూడా ఉంది.

''ఈ రాత్రికే పెళ్ళి. రంగడింకా రాలేదేమిటీ చెప్మా?'' నాలో నేనే ప్రశ్నించుకున్నాను. అంతలోనే గుర్తొచ్చింది. గతంలో వాడు నాకు శత్రువు అని. అవును! వాడు నాకు చాలా ద్రోహం చేశాడు. అలాంటి ద్రోహిని పదే పదే ఎందుకు తలుస్తున్నానో నాకు అర్థం కాలేదు. మళ్ళీ తలవిదిలించాను. కానీ జ్ఞాపకాలు నన్ను వదల్లేదు.


మనసు గతంలోకి పరుగు తీసింది.

రంగడూ నేను ఓ తల్లి బిడ్డలమే. అమ్మ చిన్నప్పుడే పోయింది. అంచేతనే పెద్దయ్యే వరకూ మా రక్తసంబంధం అపురూపంగానే ఉంది. ఇంతలో విల్లు రాయకుండా..చెల్లెలి పెళ్ళికి చేసిన అప్పు తీరకుండానే హఠాత్తుగా నాన్నగారు పోయారు.

ఉన్న ఆస్తితోపాటు అప్పు కూడా సమంగా పంచుకోవాలన్నాను నేను. అందుకు రంగడు కూడా సరేనన్నాడు. కానీ ఆ అప్పుని ఇల్లమ్మేసి తీర్చేద్దామన్నాడు. మా రంగడికి అత్తారిచ్చిన ఇల్లు ఉంది. అందుకే ఈ ఇంటి గురించి-వాడంత తేలిగ్గా మాట్లాడగలిగాడు.

నాకు మాత్రం ఆ ఇల్లమ్ముకుంటే నిలువ నీడ లేదు. అందుకే నేను 'ససేమిరా' అన్నాను. అక్కడితో గొడవలు మొదలయ్యాయి. అవి అలా అలా పెరిగి పెద్దయ్యాయి. చివరికి పెద్ద మావయ్య జోక్యంతో ఇల్లు నాకే వచ్చింది. అప్పు తీర్చేశాను. అది తీర్చగా మిగిలిన డబ్బులో రంగడి వాటా వాడికే ఇచ్చేశాను.

అది లగాయతూ ఆ ఇంటిమీద కాకి ఈ ఇంటిమీద వాల్లేదు. అటు తర్వాత మేమిద్దరం కలిసిందీ లేదు. ఆవిధంగా మా రక్తసంబంధం అక్కడితో తెగిపోయింది...అని ఇద్దరం నిర్ధారించేసుకున్నాం.



గతంలోంచి బయటపడ్డం కోసం మరోసారి తల విదిలించాను. అలసటగా అనిపించింది. లేచి వెళ్ళి అక్కడే ఉన్న మడతమంచం మీద మేను వాల్చాను. తక్షణమే నిద్ర పట్టేసింది. ఆ నిద్దట్లో కల. కలలో రంగడొచ్చాడు. వచ్చి...గుమ్మంలోనే ఉన్న నన్ను చూశాడు. ''అన్నయ్యా'' అంటూ పిల్చాడు. ఒకసారి కాదు..రెండుసార్లుకాదు...ఇంచుమించు మూడుసార్లు! అయినా నేను పలకలేదు.

ఎందుకు పలకాలి? అప్పట్లో డబ్బుకోసం నేను తన అన్నని కాదన్నాడు వాడు. నేను చచ్చిపోయానన్నాడు. నాకూ వాడికీ ఏ సంబంధం లేదన్నాడు. ఉన్న బంధం ఆ రోజుతోనే తెగిపోయిందన్నాడు. ఒకటా! రెండా! సవాలక్ష మాటలన్నాడు...ఎన్నెన్నో అవాకులూ చవాకులూ పేలాడు. అలాంటి వాడితో నేనెందుకు మాట్లాడాలి? అందుకే మాట్లాడలేదు.

వాడు బతిమాలాడు. బామాలాడు. అర్థించాడు. రంగడి మొహం చూస్తే నాకు జాలేసింది. ఎంతైనా వాడు నా తమ్ముడు కదా! అనిపించింది. కానీ అంతలోనే గతంలో వాడు నన్నన్న మాటలు గుర్తొచ్చాయి. నాలోని పెద్దరికం అహంకారం బుసలుకొట్టాయి. అంతే! మరోమారు వాడి మొహం చూడలేదు. ఇదంతా కలలోనే!

ఇంతలో ఎవరో తట్టి లేపుతున్నట్టనిపిస్తే చటుక్కున కళ్ళు తెరిచాను. ఎదురుగా నా శ్రీమతి.

''రంగడొచ్చాడు. ఇందాకా మీకోసం వచ్చాడు. మీరు నిద్రపోతున్నారని వెళ్ళిపోయాడు'' చెప్పింది.

శ్రీమతి మాటలు నా చెవుల్లో అమృత బిందువుల్లా పడ్డాయి. కానీ అంతలోనే గతం గుర్తొచ్చింది. వెంటనే నా భృకుటి ముడిపడింది. ''వాడితో నాకు మాటలేవిటి? అయినా నాతో వాడికేం పని?'' అరవాలనుకున్నాను కానీ ఆ మాటలు చాలా పేలవంగా ఒచ్చాయి.

''ఏమో! నాకేం తెలుసు? ఎంతైనా మీ తమ్ముడు కదా! అతన్నే అడగండి'' అనేసి లోపలకి వెళ్ళిపోయింది.

మళ్ళీ మంచం మీద వాలి కళ్ళు మూసుకున్నాను. నాకోసం రంగడొచ్చాడు. కానీ నేను మాట్లాడకూడదు. గట్టిగా నిశ్చయించుకున్నాను. నా నిర్ణయం పూర్తిగా పూర్తవకుండానే పక్కనే అలికిడయింది. కళ్ళు విప్పి చూశాను. రంగడు. దిగ్గున మంచం మీంచి లేచి కూర్చున్నాను. నేను లేవగానే వెంటనే నా పక్కనొచ్చి కూర్చున్నాడు వాడు. విసురుగా ముఖం తిప్పుకోవాలనుకున్నాను. నావల్ల కాలేదు. అక్కణ్ణుంచి లేవాలనుకున్నాను. శరీరం స్వాధీనంలో లేదు.

''ఏరా! బావున్నావా?'' వాడు ఆప్యాయంగా అడిగాడు. ఆ ప్రశ్నకి నాకు ఒళ్ళు మండిపోయింది.

''పద్దెనిమిదేళ్ళ తర్వాత నామీద వీడికింత ప్రేమ పుట్టిందా?'' కసిగా అనుకున్నాను. పైకి మాత్రం ''బావున్నాను'' అన్నాను.

''నువ్వెలా ఉన్నావు?'' పెదవుల చివర్నుంచి అడుగాలనుకున్నాను. కానీ ఆ మాట నాకు తెలియకుండానే గుండె లోతుల్లోంచి వచ్చేసింది.

''ఏదేరా! ఇలా ఉన్నాను..'' అన్నాడు. ఆ స్వరంలో చెప్పలేనంత బాధ. వాడి కళ్ళలో నీటిపొర. చూస్తున్న నా మనసు కలుక్కుమంది.

వాడి కన్నీటి బిందువు నా మనసు మీద నిప్పు కణికలా పడింది. మరి వాడు నా తమ్ముడు కదా! ఇక ఆగలేక చటుక్కున వాడి చేతిని నా చేతిలోకి తీసుకున్నాను. ఇన్నేళ్ళ తర్వాత..ఆ స్పర్శ మా ఇద్దర్నీ కూడా శ్రావణ మేఘాల్ని చల్లగాలిలా తాకింది.

మా రంగడు నాకంటే చిన్నవాడు కదా! అందుకే..ఇక తట్టుకోలేక చటుక్కున నన్ను చుట్టుకుని బావురుమన్నాడు. అది చూసి..నా కళ్ళు కూడా తెరలు తెరలుగా నీరు జిమ్మి పొరలు పొరలుగా రాల్చేస్తున్నాయి. మా రంగణ్ణి మరింతగా గుండెలో పొదువుకుని ఓదారుస్తున్నట్టుగా భుజం తట్టాను.

ఈసారి నాలో చెప్పలేనంత తృప్తి. నాకిప్పుడు గతం గుర్తు రావట్లేదు. గతంలో మా రంగడు నన్నన్న మాటలూ గుర్తురావట్లేదు. గుర్తున్నదల్లా..ద్వేషం పుట్టినా, పగ ప్రజ్వరిల్లినా, రుధిరం ఏరులైపారినా, రక్తసంబంధం అంత తేలిగ్గా తెగిపోదు. ఈ సంబంధాన్ని మృత్యువు తప్ప మరే శక్తీ విడదీయలేదు అన్న నిజం తప్ప!

★

అగస్త్యప్రగడ హేమంత